హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని విరమించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

చెన్నారావుపేట, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని విరమించుకోవాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని పాపయ్యపేటలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఆ భూములను చదును చేస్తూ యూనివర్సిటీ విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి దాడులు చేయడం అన్యాయమన్నారు. గ్రామాల్లోని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకుడు జన్ను రమేశ్‌ను పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులు అబ్బదాసి అశోక్, జనార్ధన్‌రెడ్డి, భూపాల్, యాకయ్య, శ్రీను పాల్గొన్నారు.

యూపీఎస్‌ను విరమించుకోవాలి

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నల్లా బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట, ఏప్రిల్ 1: కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను తక్షణమే విరమించుకోవాలని సీపీఎస్ బాధిత ఉపాధ్యాయులు పాత శ్యాంప్రసాద్, సోనబోయిన రవిచంద్ర, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శాన ఉమామహేశ్వర్ కోరారు. సీపీఎస్ బాధిత ఉపాధ్యాయులు మంగళవారం పట్టణంలో ఉపాధ్యాయులు నల్లా బ్యాడ్జీలు ధరించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ యూపీఎస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పదేళ్ల కనీస సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగికి కనీస పెన్షన్ రూ.10వేలు నిర్ధారించాలన్నారు. ప్రస్తుతం 25ఏళ్ల సర్వీస్ పూర్తి చేస్తే మాత్రమే ఉద్యోగి చివరి మూల వేతనంలో సగం పెన్షన్‌గా పొందే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగి మరణిస్తే వారి పెన్షన్‌లో 60శాతం ఉద్యోగి భార్య లేదా భర్తకు చెల్లించనున్నారని పేర్కొన్నారు. పాత పెన్షన్ పునరుద్దరణను ఉద్యోగులు బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. సీపీఎస్ బాధిత ఉపాధ్యాయులు రమేశ్, మల్లయ్య, వెంకన్న, కమలాకర్‌రెడ్డి, జ్యోతి, వెంకన్న, సందీప్ ఉన్నారు.

రేవంత్ సర్కార్ తీరు ఆక్షేపణీయం

బీఆర్‌ఎస్ మండల యూత్ నాయకుడు ఉబ్బని సింహాద్రి

రాయపర్తి, ఏప్రిల్ 1: హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న కంచె గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూముల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరు తీవ్ర ఆక్షేపణీయమని బీఆర్‌ఎస్ మండల యూత్ నాయకుడు ఉబ్బని సింహాద్రి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ప్రాణవాయువు అందించే హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కన్నుపడిందని తెలిపారు. ఆ భూములను వేలం వేసి కోట్లాది రూపాయల అక్రమార్జనకు తెర తీయాలని హెచ్‌సీయూలో బుల్డోజర్లను దింపిందని ఆరోపించారు. ఇప్పటికైనా వైఖరి మార్చుకుని హెచ్‌సీయూను పోలీసులు, బుల్డోజర్లను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, యువతతో కలిసి పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ యూత్ నాయకులు ఉబ్బని మధు, అయిత రవి, పీరని రవీందర్, గారె నరేశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన

వరంగల్, ఏప్రిల్ 1 : నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటించింది. దేశవ్యాప్తంగా నగరాల్లో పారిశుధ్య పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ర్యాంకులు ఇవ్వనున్నారు. ఈమేరకు మంగళవారం కేంద్ర బృందం నగరంలోని 25, 26, 27 డివిజన్లలో పర్యటించింది. ఈనెల 6వ తేదీ వరకు గ్రేటర్‌లో పర్యటించనున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం కేటగిరీల వారీగా మార్కులు వేయనుంది. ఇంటింటి చెత్త సేకరణ, స్వీపింగ్, చెత్త శుద్ధీకరణ, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ నిర్వహణ తదితర అంశాలను పరిగణలోని తీసుకోనున్నారు. కార్పొరేషన్ అధికారులకు సంబంధం లేకుండా కేంద్ర స్వచ్ఛ సర్వేక్షన్ బృందం నగరంలో పర్యటించడం గమనార్హం.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకం

★హన్మకొండ సమీపంలోని యాదవనగర్ పెట్రోల్ పంప్ రెడ్డిపురం ప్రాంతంలో సాయికృపా కాలనీలో రెండు కొత్త తూర్పు ముఖంగా187 గజాల ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. Cont: VRN Developers & Builders-9700101918.
NTW-332491

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

WANTED

★మా వద్ద పనిచేయుటకు స్త్రీ, పురుషులు (6) గురు కావలెను. వయస్సు: 30 సం||ల లోపువారు. ఉచిత వసతి, జీతం : 10,000/- నుండి 15,000/- వరకు. సెల్: 9849316058, వరంగల్.
NTW-336919

TOURS & TRAVELS



★16/04/25 అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 సరస్వతీ పుష్కరాలు, చార్‌థామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. Ph: 9397617094.
NT-1899

మహిళలకు శుభవార్త

★శ్రీ శైలి బ్యూటీ పార్లర్‌లో ఫ్రీ బ్యూటీషియన్ కోర్సు గవర్నమెంట్ సర్టిఫికెట్‌తో నేర్పించబడును. టైలరింగ్, మగ్గం వర్క్, మెహిందీ 5 వేలకే With సర్టిఫికెట్‌తో నేర్పబడును. సెల్: 9989060668
NTW-336920

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన బాక్ అండ్ వెట్ పకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

లక్ష్యం రూ.56 కోట్లు.. వచ్చింది రూ.39.5 కోట్లు

- ఎనుమాముల మార్కెట్‌కు తగ్గిన పన్నుల ఆదాయం
- సిబ్బంది కొరత.. వరుస సెలవులతో ఇబ్బందులు
- గత ఏడాది వంద శాతం పూర్తయిన వసూళ్లు

కాశీబుగ్గ, ఏప్రిల్ 1: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్లు భారీగా తగ్గాయి. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ రూ. 56 కోట్ల లక్ష్యాన్ని విధించగా, రూ.39.5కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. గత ఏడాది రూ.42కోట్లుగా నిర్ణయించిన టార్గెట్‌ను వందశాతం పూర్తి చేయగా ఈ సారి రూ.16.50కోట్ల మేర రాబడి తగ్గింది. రెండు నెలల ముందు నుంచే ఉన్నతాధికారులు ఒక ప్రణాళికతో బృందాలను ఏర్పాటు చేసి పన్ను వసూలు చేయాలి. అయితే మార్కెట్ కమిటీలో సిబ్బంది కొరత వల్ల పన్ను వసూళ్లలో జాప్యం జరిగినట్లు తెలుస్తున్నది. అలాగే మార్కెట్ కమిటీ కార్యదర్శి పోలెపాక నిర్మల ఇటీవల సస్పెండ్ కాగా ఇన్‌చార్జి కార్యదర్శిగా నర్సంపేట మార్కెట్ సెక్రటరీ జీ రెడ్యా విధులు నిర్వర్తిస్తున్నారు. మొండి బకాయిలు సైతం పెండింగ్‌లోనే పడిపోయాయి. మొత్తానికి తిప్పలు పడి ఇప్పటి వరకు రూ .39.5 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా మార్కెట్ ఫీజు రూ. 50 లక్షలు, ఐకేపీ ద్వారా రూ 1.07 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. అలాగే మార్కెట్‌కు చివరి వారంలో వరుసగా ఉగాది, రంజాన్ పండుగలు రాగా, బ్యాంకులకు సెలవులు ఇవ్వడంతో వ్యాపారుల నుంచి పెండింగ్ డబ్బులు వసూలు చేయడంలో సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బీసీల పోరు గర్జన విజయవంతం చేయాలి

కరీమాబాద్/నర్సంపేట, ఏప్రిల్ 1: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈనెల 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టే బీసీ పోరు గర్జన ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగికార్ రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీమాబాద్‌లో ఆయన మాట్లాడారు. బీసీలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. బీసీ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నర్సంపేట డివిజన్‌లోని పలు మండలాల బీసీ నాయకులు మంగళవారం ఢిల్లీకి తరలివెళ్లారు. కేంద్రం బీసీలకు 41శాతం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు.

ఎర్రబెల్లి మేనత్త మృతిపై కేసీఆర్, కేటీఆర్ సంతాపం

పర్వతగిరి, ఏప్రిల్ 1: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మేనత్త, వరంగల్ ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి నారాయణరావు తల్లి ఏనుగల్లు గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి సుభద్రదేవి ఇటీవల మరణించగా మంగళవారం వారికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్ చేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి, మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మృతురాలి కుమారులు తక్కళ్లపల్లి నారాయణరావు, భాస్కర్‌రావు, వరదరాజేశ్వర్‌రావుకు ఫోన్ చేసి పరామర్శించి ధైర్యం చెప్పారు.

సైబర్‌క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ బదిలీ

సుబేదారి, ఏప్రిల్ 1 : వరంగల్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైం విభాగంలో పనిచేస్తున్న ఏసీపీ కే విజయకుమార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం జిల్లాలో సైబర్‌క్రైం విభాగంలో పనిచేస్తున్న ఫణిందర్‌కు ఇక్కడి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

హెచ్‌సీయూ భూముల వేలం నిలిపివేయాలి

సంగెం, ఏప్రిల్ 1: హెచ్‌సీయూ భూముల వేలాన్ని ప్రభుత్వం నిలిపివేయాలని అఖిల భారత యువజన సమాఖ్య మండల కన్వీనర్ జక్క అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని కుంటపల్లిలో మంగళవారం ఏఐఎఫ్‌డీవై సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎర్ర రాజు, జక్క రాజు, అశోక్, శ్రీనివాస్, సురేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

నర్సంపేట, ఏప్రిల్ 1: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసీలను హత్య చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు దయాకర్, ఎలకంటి రాజేందర్ కోరారు. హైదరాబాద్‌లో ఈనెల 8న నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద పోస్టర్లతో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈనెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ప్రజా ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గట్టి కృష్ణ, బోగి సారంగపాణి ఉన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్ట్

రూ.42,780 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, బైక్ సీజ్

నెక్కొండ, ఏప్రిల్ 1: మండలంలోని అలంకానిపేటలో మంగళవారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి రూ.42,780 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా పేకాట ఆడుతున్న మంగిశెట్టి శ్రీను, మాస్ కుమారస్వామి, ఎడ్ల లక్ష్మీనారాయణ, గాజుల జనార్ధన్ పట్టుపడ్డారని, కేసు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పి ప్రమాదం

చెన్నారావుపేట, ఏప్రిల్ 1: ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మండలంలోని గొల్లపల్లి - ఖాదర్‌పేట మధ్య మంగళవారం జరిగింది. గొల్లపల్లికి చెందిన ఓ రైతు తన ధాన్యం బస్తాలను మార్కెట్‌కు తరలిస్తుండగా ఖాదర్‌పేట సమీపంలో చెరువుకట్ట ఎక్కుతుండగా అదుపుతప్పి బోల్తాపడగా, డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు.

సీకేఎం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ధర్మారెడ్డి

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 1: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎ.ధర్మారెడ్డి తాత్కాలికంగా బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శశిధర్‌రావు మార్చి 31న ఉద్యోగ విరమణ పొందడంతో వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న ధర్మారెడ్డికి తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా వైస్ ప్రిన్సిపాల్ ధర్మారెడ్డిని నియమిస్తారా, ఇతర కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తారా అనేది అధ్యాపకుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రిన్సిపాల్ పోస్టు కోసం పైరవీలు చేసుకుంటున్నట్లు సమాచారం.

బల్దియాకు భారీ ఆదాయం

- ఎల్ఆర్‌ఎస్ ద్వారా రూ.94కోట్లు
- ఆస్తి పన్నుల ద్వారా రూ.91.35కోట్లు
- ఎక్కువ పన్నుల వసూళ్ల జాబితాలో గ్రేటర్

వరంగల్, ఏప్రిల్ 1: బల్దియాకు భారీ ఆదాయం సమకూరింది. ఎల్ఆర్‌ఎస్ ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం వచ్చింది. ఎల్ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ కల్పించడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు ముందుకు వచ్చి ఫీజులు చెల్లించారు. దీంతో రూ.94 కోట్లు సమకూరాయి. ఆస్తి పన్నుల ద్వారా రూ.91.35కోట్ల ఆదాయం వచ్చింది. రాత్రి 9గంటల వరకు రూ.80కోట్లు వచ్చినట్లు ప్రకటించిన అధికారులు అర్ధరాత్రి వరకు వచ్చిన పన్నుల ద్వారా రూ.91కోట్లకు చేరింది.

పది మున్సిపాలిటీల జాబితాలో గ్రేటర్‌కు చోటు

ఎక్కువ పన్ను వసూళ్లు చేసిన 10 మున్సిపాలిటీల జాబితాలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు చోటు దక్కింది. తొలుత పన్నుల వసూళ్లలో వెనుకబడిన గ్రేటర్ కార్పొరేషన్ అధికారులు తర్వాత పుంజుకున్నారు. మెప్మా నుంచి ఆర్పీలతోపాటు బల్దియాలోని ప్రజారోగ్య విభాగాల అధికారులు, సిబ్బందికి పన్నుల వసూళ్ల విధులు అప్పగించారు. పది రోజుల పాటు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించగా రూ.117కోట్ల డిమాండ్‌కుగాను రూ.91.35 కోట్లు వసూలు చేశారు. గత ఏడాది కంటే రూ.17.41కోట్లు ఎక్కువ వసూలు చేశారు. దీంతో రాష్ట్రంలో ఎక్కువ ఆస్తి పన్నులు వసూలు చేసిన 10 మున్సిపాలిటీల జాబితాలో గ్రేటర్ వరంగల్‌కు స్థానం దక్కింది.

రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

సంగెం: సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం/ గీసుగొండ/ రాయపర్తి/ వర్ధన్నపేట, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సంగెం గౌడ కమ్యూనిటీ హాల్, గీసుకొండలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాయపర్తిలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రారంభించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, సివిల్ సప్లై డీటీ మధుసూదన్, గీసుగొండలో తహసీల్దార్ రీయాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, కొమురారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. రాయపర్తిలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి జీ.కిష్టయ్య, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోతు కిషన్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్లు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, డి.మధుసూధన్, గిర్దావర్‌లు కొయ్యాడ చంద్రమోహన్, తోట సంధ్యారాణి, ఎంపీవో కూచన ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్ పాల్గొన్నారు. వర్ధన్నపేటలో అదనపు కలెక్టర్‌తోపాటు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఇల్లందలో ఎమ్మెల్యే నాగరాజు

గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో 51వ ర్యాంకు

ఏడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన యువకుడు

గ్రూపు-1లో ర్యాంకు సాధించిన నితీష్‌ను అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 1: ప్రస్తుత పోటీ ప్రపంచంలో సర్కార్ ఉద్యోగం ఒక్కటి సంపాదించాలంటేనే ఎంతో కష్టం. అలాంటిది ఏడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు ఓ యువకుడు. ఇటీవల తెలంగాణ పబ్లిక్ పబ్లిక్ సర్వీస్ గ్రూపు-1 పరీక్షా ఫలితాల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 500 మార్కులతో 51వ ర్యాంకు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. వరంగల్ దేశాయిపేట రోడ్డు ఫిల్టర్‌బెడ్ సమీపంలోని లక్ష్మీ కస్తూరి టవర్‌లో నివసిస్తున్న ఐతు వీరేష్-మంజుల కుమారుడు నితీష్ చిన్నప్పటి నుంచి కష్టపడి చదివేవాడు. తండ్రి వీరేశ్ చిన్న వ్యాపారం చేస్తుండగా, తల్లి మంజుల గృహిణి. నితీష్ వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని లర్నర్స్ ల్యాండ్ స్కూల్‌లో పదోతరగతి వరకు చదివి, హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్, బీటెక్ పూర్తి చేశారు. ఆతర్వాత ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో పోటీ పరీక్షలు రాశాడు. ఐదు సార్లు సివిల్స్ కూడా రాశాడు. ఈ క్రమంలో గ్రూపు 2, 3, 4తోపాటు సింగరేణి, ఎస్సెస్సీ సీజీఎల్‌లో సత్తాచాటాడు. టీజీపీ ఏస్సీ డీఏవోగా కూడా ఎంపికయ్యాడు. చివరకు యూపీఎస్సీ పరీక్షలోనూ ప్రతిభ చాటి ఉద్యోగాన్ని సంపాదించాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ఈపీఎఫ్‌వోలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రూపు -1 రాసి రాష్ట్రస్థాయిలో 500 మార్కులు సంపాదించి 51వ ర్యాంకు సాధించాడు. కాగా, తనకు డిప్యూటీ కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని ఉందని, అందుకోసం ప్రయత్నం చేస్తానని చెప్పాడు.

బీఆర్‌ఎస్ నాయకుల పరామర్శ

రాయపర్తి, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన ఎనగందుల యాదమ్మ మంగళవారం అనారోగ్య సమస్యలతో మృతిచెందింది. బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆమె మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు లేతాకుల రంగారెడ్డి, గారె నర్సయ్య, పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, అయిత రాంచందర్, చందు రామ్‌యాదవ్, ఎనగందుల యాదగిరి, ఉబ్బని సింహాద్రి, బల్లెం యాదగిరి, మైస వెంకటేశం, గారె నరేశ్, మహ్మద్ లాలూమియా ఉన్నారు.

ట్రేడ్ మార్క్ వస్తువులనే కొనుగోలు చేయాలి

నర్సంపేట, ఏప్రిల్ 1: ప్రభుత్వ ట్రేడ్ మార్క్ ఉన్న ఆహార పదార్థాలు, వస్తువులు మాత్రమే కొనుగోలు, అమ్మకాలు చేయాలని వినియోగదారుల డీసీఐసీలు గిరగాని సుదర్శన్‌గౌడ్, శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బుక్లెట్స్‌ను ఆర్డీవో ఉమారాణి చేతులమీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ టోల్ ఫ్రీ నంబర్లు, వాట్సాప్ నంబర్లు 8800001915, 1800114000, 180042500333, 1915, డ్రగ్స్‌కు 18005996969, అబ్కారీకి 18004252523, ఆహార పదార్థాలు కల్తీకి 9868686868, 1800112100 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. బెజ్జంకి డీసీఐసీలు ప్రభాకర్, నాగెల్లి సారంగం, వెంకటాచారి, రాము, ఠాకూర్ రతన్‌సింగ్ ఉన్నారు.

గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

నర్సంపేట, ఏప్రిల్ 1: పట్టణంలోని సర్వే నంబర్ 813 అంబేద్కర్ నగర్ గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ పట్టణ నాయకుడు దేవోజు సదానందం, న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్ అన్నారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో ఎంఎస్పీ, డీబీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. వారు వేర్వేరుగా మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపెల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, విమల, విజయ, సమ్మక్క ఉన్నారు.

కులగణన రెమ్యునరేషన్ మంజూరు చేయాలి

నల్లబెల్లి, ఏప్రిల్ 1: కులగణన సర్వేలో పాల్గొన్న అధికారులకు రావాల్సిన రెమ్యునరేషన్ మంజూరు చేయాలని తెలంగాణ ఉద్యమ కారుడు, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు లేఖ రాసి రిజిష్టర్ పోస్టును మండల కేంద్రంలో మంగళవారం పోస్ట్‌మెన్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేయర్లకు రూ.12వేలు, ఎన్యూమరేటర్లకు రూ.10వేలు, ప్రభుత్వ కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక్కో కాపీ ఆన్‌లైన్ చేస్తే రూ.15, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ.30 చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. కులగణన జరిగి ఐదు నెలలు గడుస్తున్నా రెమ్యునరేషన్ మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు మృతి



వేల్పుగొండ రాజు (ఫైల్)

నర్సంపేట, ఏప్రిల్ 1: బీఆర్‌ఎస్ పార్టీ నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు వేల్పుగొండ రాజు(52) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నారు. నెల రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య మాజీ కౌన్సిలర్ వేల్పుగొండ పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

25కిలోల గంజాయి పట్టివేత

వర్ధన్నపేట, ఏప్రిల్ 1: భువనేశ్వర్ నుంచి గుజరాత్‌కు ఇద్దరు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న ఘటన వర్ధన్నపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం వర్ధన్నపేట బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తుండగా అనుమానంగా మహిళ, పురుషుడు కనిపించగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న సంచులు తనిఖీ చేయగా గంజాయి గుర్తించారు. సుమారు 25కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు ఒడిషా రాష్ట్రానికి చెందిన వారని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భద్రకాళికి లక్ష గన్నేరు పూలతో అర్చన

వరంగల్, ఏప్రిల్ 1 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మూడో రోజుకు చేరాయి. మంగళవారం భద్రకాళీ అమ్మవారికి గులాబీ రంగు గల లక్ష గన్నేరు పూలతో అర్చన చేశారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం తర్వాత గులాబీ రంగు గన్నేరు పూలతో అర్చన చేశారు. అమ్మవారికి నివేదన జరిపి ప్రసాద వితరణ చేశారు.

బస్సు ఢీకొని మెకానిక్ మృతి

జయచంద్ర (ఫైల్)

గీసుగొండ, ఏప్రిల్ 1: బస్సు ఢీకొని ఓ మెకానిక్ మృతిచెందిన ఘటన గ్రేటర్ 16వ డివిజన్ గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట శివారు సోమ్లతండాకు చెందిన భూక్యా జయచంద్ర(23) కొద్ది నెలలుగా వరంగల్‌లో ఉంటూ మహాదేవ కార్ కేర్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గొర్రెకుంట వద్ద కస్టమర్ కారు బ్రేక్ డౌన్ అయిందని ఫోన్ రాగా, సోమవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై వెళ్లి కారు రిపేర్ చేసి తిరిగి వస్తుండగా గొర్రెకుంట క్రాస్ రోడ్డు వద్ద వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావటంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని మామునూర్ ఏసీపీ తిరుపతి సందర్శించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి జవహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య పిల్లలున్నారు.

వెంకటాపురంలో మహిళ అదృశ్యం

సౌందర్య

సంగెం, ఏప్రిల్ 1: ఇద్దరు పిల్లల తల్లి అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై ఎల్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోటవెంకటాపురానికి చెందిన బోటిక ప్రభాకర్ మొదటి భార్య మృతిచెందగా రెండో వివాహంగా సౌందర్యను 2013లో చేసుకున్నాడు. వారికి అమ్మాయి, అబ్బాయి జన్మించారు. మూడు నెలల క్రితం సౌందర్య తల్లి మృతిచెందగా శాయంపేటకు వెళ్లింది. అక్కడ కొల్కనూరి సురేష్ పరిచయం కాగా, అతడితో ఫోన్‌లో మాట్లాడుతుండేది. ఈ క్రమంలో పలుమార్లు భర్త మందలించినప్పటికీ మాట్లాడుతుండేది. గత నెల 27న ఆమె దవాఖానకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ప్రభాకర్ చుట్టుపక్కల వాళ్లు, బంధువులు, తెలిసిన వాళ్లను అడగ్గా కనిపించలేదు. దీంతో మంగళవారం ప్రభాకర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో లిఫ్ట్‌ల మరమ్మతులు

'నమస్తే' కథనానికి స్పందన



వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 1: నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని లిఫ్ట్‌లను అధికారులు మంగళవారం మరమ్మతు చేపట్టారు. ఆస్పత్రిలో పరికరాలు పనిచేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, పరికరాలకు మరమ్మతులు చేయాల్సి ఉందని 'నమస్తే తెలంగాణ'లో మార్చి 31న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించి పలు పరికరాలకు మరమ్మతులు చేపట్టారు. ఇంకా అవసరం ఉన్న చోట కొత్త పరికరాలు తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పదోన్నతి పొందిన టీచర్లకు శిక్షణ

గిర్మాజీపేట, ఏప్రిల్ 1: జిల్లాలో పదోన్నతి పొందిన పీజీహెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ టీచర్లకు కరీమాబాద్‌లోని జీహెచ్‌ఎస్, సోషల్, మ్యాథ్స్, ఇంగ్లిష్ టీచర్లకు రంగశాయిపేట జీహెచ్‌ఎస్‌లో, గెజిటెడ్ హెచ్‌ఎంలకు, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలకు, బయోసైన్స్, ఫిజికల్ డైరెక్టర్‌లకు శంభునిపేట జీహెచ్‌ఎస్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. హాజరయ్యే 472 మంది టీచర్లు తాము బోధించే సబ్జెక్ట్స్, నోట్‌బుక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

సమయపాలన పాటించాలి

గీసుగొండ, ఏప్రిల్ 1: వైద్యాధికారులు సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో సాంబశివరావు అన్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీలోని పల్లె దవాఖానను ఆయన సందర్శించారు. ఫార్మసీ, ఓపీ రిజిష్టర్, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీలతోపాటు వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండలన్నారు. వైద్యాధికారి జాబిలీ, డిప్యూటీ డెమా అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సీసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్

నెక్కొండ/కాశీబుగ్గ, ఏప్రిల్ 1: కన్జ్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ ఎంపికయ్యారు. మూడు దశాబ్దాలుగా వినియోగదారుల ఉద్యమంలో వినియోగదారుల మండలి, పౌర సరఫరాల విభాగానికి ప్రభుత్వ కమిటీల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనను జాతీయ నాయకత్వం గుర్తించి ఈ పదవి అప్పగించింది. కాగా, నగరంలోని 18వ డివిజన్ లేబర్‌కాలనీకి చెందిన రావుల రంజిత్‌కుమార్‌ను కన్జ్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు జాతీయ అధ్యక్షురాలు ప్రీతి పాండ్య ఉత్తర్వులు జారీచేశారు.

పంట కాల్వ ఆక్రమణ

నల్లబెల్లి, ఏప్రిల్ 1: మండల కేంద్రం సమీపంలో పెద్దచెరువు పంట కాల్వను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రైతులు పోతునూరి సుబాష్, పిట్టల రాములు, బూర రాములు, నర్సింహస్వామి, వైనాల వీరస్వామి, మేడిపల్లి ఐల య్య, జక్కుల సాంబయ్య పంట కాల్వ ఆక్రమణను పరిశీలించారు. పంట కాల్వను పూడ్చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు సదరు వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ ఖో-ఖో రెఫరీగా రాంబాబు

నర్సంపేట, ఏప్రిల్ 1: జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల రెఫరీగా పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ కోట రాంబాబు ఎంపికైనట్లు ఎంఈఓ కొర్ర సారయ్య మంగళవారం తెలిపారు. ఒడిషా రాష్ట్రం పూరీ జగన్నాథస్వామి స్టేడియంలో ఈ నెల 4 వరకు జరిగే 57వ సీనియర్ నేషనల్ ఖో-ఖో చాంపియన్‌షిప్‌లో రెఫరీగా ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్సంపేట, ఏప్రిల్ 1: మండలంలోని కమ్మపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2005-06 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం మహేశ్వరం శివారు గ్రీన్ రిసార్ట్‌లో ఘనంగా జరిగింది. 20 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. నాటి జ్ఞాపాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, పనుల గురించి ఒకరికొకరు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.